క్లుప్తంగా

వెంకన్నకు పంచామృతాభిషేకం



అభిషేకం చేస్తున్న అర్చకుడు

పెందుర్తి : వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. 2 లక్షల విరాళం



జూనియర్ అసిస్టెంట్ కాశయ్యకి చెక్కు అందజేస్తున్న దాత

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి శుక్రవారం ఆటోనగర్‌కి చెందిన వి.రమేష్‌బాబు రూ. 2 లక్షల 1,116 విరాళం అందజేశారు. సింహగిరికి వచ్చిన దాత సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో అన్నప్రసాద పథకం జూనియర్ అసిస్టెంట్ కాశయ్యకి అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

పెందుర్తి : జీవీఎంసీ 98వ వార్డు పద్మావతినగర్‌లో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును కాలనీ ప్రతినిధులు కోరారు. శుక్రవారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ కాలనీలోని సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

నేడు కంటి వైద్య సేవల నిలుపుదల

సింహాచలం : విశాఖ, శ్రీకాకుళం జిల్లాల్లో ఉన్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రుల్లో శనివారం వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఆస్పత్రి డీజీఎం కె.బంగారాజు తెలిపారు. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారానికి నిరసనగా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ఆల్ ఇండియా ఆప్తామాలజికల్ సొసైటీ పిలుపు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. అత్యవసర సేవలకు మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. విశాఖలోని నాయుడుతోట, గాజువాక, మధురవాడ, మద్దిలపాలెం, శ్రీకాకుళంలో 24 గంటల పాటు వైద్యసేవలు బంద్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, రోగులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకునికి ప్రతిభా పురస్కారం



ప్రశంసాపత్రం అందుకుంటున్న డాక్టర్ గణేష్

సబ్బవరం : ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకునికి ఉత్తమ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్‌గా ప్రతిభా పురస్కారం లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిస్టరీ అధ్యాపకుడిగా పని చేస్తున్న డాక్టర్ ఎల్. గణేష్‌కు విశ్వవిద్యాలయ స్థాయిలో ఉత్తమ పురస్కారం లభించడంతో ఏయూ వీసీ ఆచార్య జి. శశిభూషణరావు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా జ్ఞాపికతో పాటు ప్రశంసా పత్రం అందజేశారు. దీంతో గణేష్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ఘనంగా దుర్గాగణపతి ఆలయ వార్షికోత్సవం

సీతంపేట: సీతంపేట కూడలిలో కొలువైన దుర్గాగణపతి ఆలయ 32వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, ప్రత్యేక అలంకరణ, గణపతి హోమం, విశేష పూజాకార్యక్రమాలు జరిపారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు.

శ్రావణలక్ష్మీ.. వరాలు కురిపించు

- వైభవంగా వరలక్ష్మి పూజలు
- భక్తులతో కిటకిటలాడిన అమ్మవార్ల దేవాలయాలు

పవిత్ర శ్రావణమాసంలో శ్రావణ శుక్రవారం వరలక్ష్మి పూజలతో పెందుర్తి ఆధ్యాత్మిక చింతనలో పరవశించింది. శ్రావణలక్ష్మి నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలోని అమ్మవార్ల దేవాలయాలు కిటకిటలాడాయి. మహిళలు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు చేశారు.



ఎస్ఆర్ పురంలో విశేషాలంకరణలో పూజలందుకున్న కనకదుర్గమ్మ



పెందుర్తిలో మహాలక్ష్మి అవతారంలో పూజలందుకున్న మహా కామేశ్వరి అమ్మవారు



సుజాతానగర్‌లోని కనకదుర్గ ఆలయంలో పూజలందున్న అమ్మవారు

పెందుర్తి : శ్రావణమాస పూజా మహోత్సవాలలో భాగంగా చినముషిడివాడ దరి అలివేలు మంగమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి 100 కిలోల పసుపు-కుంకుమ, పాలు, పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు జరిపారు. విష్ణు, లలిత పారాయణలు జరిగాయి. సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- ఎస్ఆర్ పురంలో కొలువుదీరిన కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారు విశేష అలంకరణలో దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.
- సుజాతానగర్‌లోని అయ్యప్పస్వామి దేవాయల ప్రాంగణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. మహాలక్ష్మిగా అమ్మవారు పూజలందుకున్నారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
- శ్రమశక్తినగర్‌లోని పంచముఖ గాయిత్రిమాత ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.
- సాధూమఠం సంతోషిమాత ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణశర్మ, ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి.
- పెందుర్తి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.
- పెందుర్తిలోని మహా కామేశ్వరీ ఆలయంలో పూజలు ఘనంగా నిర్వహించారు. మహాలక్ష్మిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున సామూహిక కుంకుమ పూజలు జరిపారు.

సింహగిరిపై ఘనంగా లక్ష కుంకుమార్చన..

సింహాచలం : వరలక్ష్మీ వ్రతం, శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వేంచేసిన సింహవల్లీ తాయారు అమ్మవారికి ఘనంగా లక్ష కుంకుమార్చన నిర్వహించారు. సింహవల్లీ తాయారు, సువర్ణ అమ్మవార్ల ఉత్సవమూర్తులను వేదికపై అధిష్టింపజేసి ఉదయం 7 నుంచి 9 గంటల వరకు లక్ష నామాలు పఠిస్తూ కుంకుమపూజ నిర్వహించి అష్టహారతి అందజేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు కుంకుమ, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. సాయంత్రం అమ్మవారికి ఆలయ బేడా మండపంలో ఘనంగా తిరువీధి నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి సహస్రనామార్చన పూజ వేడుకగా నిర్వహించారు. అమ్మవారి సన్నిధిని కనులపండువగా ముస్తాబు చేశారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి.



సింహవల్లీ తాయారు అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు



వెంకన్న ఆలయంలో లక్ష్మీదేవికి కుంకుమపూజ నిర్వహిస్తున్న అర్చకులు



పూజలో పాల్గొన్న భక్తులు

వెంకన్న ఆలయానికి శ్రావణ శోభ..

శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన కొండ దిగువ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి విశేషంగా కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని శోభాయమానంగా ముస్తాబు చేసి ఆలయ ప్రాంగణంలో వేదికపై అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. కుంకుమ ప్రసాదాన్ని అందజేశారు. పెద్ద ఎత్తున మహిళలు, భక్తులు ఆలయానికి తరలివచ్చారు. అర్చకుడు కె.కె. భార్గవ తదితరులు పూజలు నిర్వహించారు.

ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో...

అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్ర మౌళీశ్వర స్వామి ఆలయంలోని ఉమాదేవి సన్నిధిలో శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని విశేషంగా పూజలు జరిగాయి. అమ్మవారికి ఘనంగా కుంకుమపూజ నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున ఈ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణ శర్మ ఈ పూజలు నిర్వహించారు.

దేవీపురంలో..

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవీ పీఠంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. భిలాయ్ నుండి వచ్చిన అంజూ, ముంబై నుండి వచ్చిన సిమ్రాన్, సౌతాఫ్రికా నుండి వచ్చిన రుఖాయ్ తదితర భక్తులు అమ్మవారి ప్రాంగణంలో వరలక్ష్మి పూజ, అష్టోత్తర శత నామావళి సహిత కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో పాల్గొన్న మహిళా భక్తులకు గాజులు, పసుపు, కుంకుమ, రవిక, ప్రసాదాలు అందజేశారు. అమృత కన్యా గురుకులం పిల్లలు బాల అమ్మవార్ల వలె దుర్గా సూక్తం, మహాలక్ష్మి అష్టకం చదువుతూ వ్రతం నిర్వహించారు.



దేవీపురంలో సామూహిక పూజల్లో పాల్గొన్న మహిళలు

మాజీ ప్రధాని వాజపేయికి ఘన నివాళి



మాజీ ప్రధాని వాజపేయికి నివాళి అర్పిస్తున్న రాముునాయుడు తదితరులు

పెందుర్తి : దివంగత ప్రధాని, భారతరత్న అటల్ బిహారి వాజపేయి వర్ధంతి సందర్భంగా స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్లె రామునాయుడు ఘనంగా నివాళి అర్పించారు. వాజపేయి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి అటల్‌జీ చేసిన సేవలు మరువలేనివి అన్నారు. అనునిత్యం దేశసేవలో తరించిన కార్యశీలి అని కొనియాడారు. బీజేపీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



ముత్యాలమ్మపాలెంలో వాజపేయి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

ముత్యాలమ్మపాలెంలో..

పరవాడ: దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతిని ముత్యాలమ్మపాలెం గ్రామంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ యువమోర్చా జిల్లా కార్యదర్శి మోస రామకృష్ణ, బీఎంఎస్ సీనియర్ నాయకులు సోమశేఖర్, మాసవరపు నాగరాజు, చుక్క కృష్ణ, కొండబాబు, నూకరాజు, మురళి తదితరులు పాల్గొని వాజ్‌పేయి చిత్రపటం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు.

'మైనారిటీ సమితి' జిల్లా అధ్యక్షుడిగా అస్లం ఖాన్

సీతమ్మధార: రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా 14వ వార్డు సీతమ్మధారకు చెందిన మహ్మద్ అస్లం ఖాన్ నియమితుడయ్యారు. సీతమ్మధారలోని ఒక హోటల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మొహమ్మద్ ఫారుఖీ షుబ్లీ ఆయనకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో విశాఖలోని అన్ని నియోజకవర్గాలకు కొత్తగా అధ్యక్షులను నియమిస్తామని తెలిపారు.

మైనారిటీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమితి నిరంతరం కృషి చేస్తోందన్నారు. అస్లం ఖాన్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఎంతో గౌరవ ప్రదమైన పదవిని కేటాయించడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఫారుఖ్ షుబ్లీ, ముస్లిం పెద్దలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



అస్లం ఖాన్‌ను అభినందిస్తున్న సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఫారుఖ్ షుబ్లీ

డీఎస్సీలో సీఆర్పీలకు వెయిటేజీ ప్రకటించాలి

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్వహించనున్న డీఎస్సీ-24లో సమగ్ర శిక్షలో పని చేస్తున్న సీఆర్పీలకు వెయిటేజీ కల్పించాలని ఉద్యోగుల జిల్లా జేఏసీ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కంచరపాలెం బీఎస్ఆర్ భవనంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల విశాఖ జిల్లా జేఏసీ ప్రతినిధులు పి.గణపతి, లంక చైతన్య శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. బీఈడీ, టెట్ పరీక్షలు పాసై సమగ్ర శిక్షలో 12 ఏళ్లుగా చాలీచాలనీ జీతాలతో ఉద్యోగాలు చేస్తున్న సీఆర్పీలకు వెయిటేజీ ఇచ్చి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం : ఫీడర్ల నిర్వహణ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకి అంతరాయం కలుగుతుందని జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. 93వ వార్డు పరిధిలోని శ్రీనివాసనగర్, 98వ వార్డు పరిధిలోని అప్పన్నపాలెం, పద్మావతినగర్, షిప్‌యార్డ్ లే అవుట్, మైత్రీనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకి అంతరాయం ఏర్పడుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

35 కిలోల గంజాయి పట్టివేత

పెందుర్తి : ఒడిశా నుంచి నగరానికి గంజాయి తరలిస్తున్న ముఠా గుట్టును పెందుర్తి పోలీసులు రట్టు చేశారు. కోయంబత్తూర్‌కు చెందిన గోవిందరాజు సత్యమూర్తి, చిత్రవేలు ఒడిశా నుంచి గంజాయి సేకరించి కిరండోల్ రైల్లో పెందుర్తి తీసుకొచ్చారు. వారు స్టేషన్‌లో రైలు దిగి పెందుర్తి వైపు వస్తున్న సమయంలో పక్కా సమాచారంతో పెందుర్తి పోలీసులు కాపు కాసి వారిని పట్టుకున్నారు. నిందితుల వద్ద ఉన్న 35 కిలోల గంజాయి, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎల్.రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

డంపింగ్ యార్డ్ పరిశీలన



డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్‌కుమార్

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు రామచంద్రనగర్ సమీపంలోని డంపింగ్ యార్డ్‌ను జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ నరేష్‌కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్ యార్డ్‌కు వచ్చే చెత్తను ఎప్పటికప్పుడు కాపులుప్పాడ తరలించాలని ఆదేశించారు. అలాగే క్లోజ్‌డ్ కంపోజ్ సిస్టం పని తీరుపై ఆరా తీశారు. డంపింగ్ యార్డ్‌లో నిల్వ ఉన్న స్టిల్ట్‌ను వెంటనే తరలించాలన్నారు. ఆయన వెంట జీవీఎంసీ జోన్-6 ఏఎంవోహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ ఉన్నారు.

ఎమ్మెల్సీ బొత్సకు అభినందన



బొత్సను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, గండి రవి, ముమ్మన దేముడు

పెందుర్తి : ఉమ్మడి విశాఖ జిల్లా స్థానిక సంస్థల వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీగా ఎన్నికైన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ నేత గండి రవికుమార్, 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుని అభినందనలు తెలిపారు. నగరంలోని కలెక్టరేట్‌లో నియోజకవర్గ సీనియర్ వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి బొత్సను సత్కరించారు. నియోజకవర్గ పరిధిలోని వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి చక్కటి స్పందన

పెందుర్తి : పెందుర్తి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరానికి చక్కటి స్పందన లభించింది. మదర్ బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు మొత్తం 51 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రాణాపాయంలో ఉన్న వారి కోసం రక్తదానం చేయడం ఎంతో పుణ్యప్రదం అన్నారు. ఒకరు రక్తదానం చేస్తే ముగ్గురి ప్రాణాలు నిలబెట్టిన వారవుతారన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. సాయి ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం అని అభినందించారు. రక్తదాతలకు ప్రశంసా పత్రాలతో పాటు ఒక్కో మొక్క అందజేశారు. నాయకులు దాడి రమణచిట్టి, దాడి ఉమామహేష్, దాడి సురేష్, ట్రస్ట్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్, ప్రతినిధులు కందుల నవీన్, సిరిమల్ల గణేష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న పీలా శ్రీనివాసరావు

అప్పన్న మూలవిరాట్‌కు సహస్రనామార్చన పునరుద్ధరణ

- కోవిడ్ కారణంగా నిలిచిన సేవ

సింహాచలం : సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కి జరిగే సహస్రనామార్చన పూజని శుక్రవారం సాయంత్రం నుంచి పునరుద్ధరించారు. కోవిడ్‌కి ముందు ప్రతి రోజూ సాయంత్రం 5గంటలకు అంతరాలయంలో ఉండే స్వామివారి మూలవిరాట్‌కి సహస్రనామార్చన నిర్వహించేవారు. ఈసేవలో పాల్గొనే భక్తులందరినీ భోగమండపంలోనే ఆశీనులను చేసేవారు. కోవిడ్ కారణంగా ఆ సేవని రద్దు చేశారు. కోవిడ్ తగ్గుముఖం పట్టాక ఆలయ కల్యాణమండపంలో ఉత్సవమూర్తులకు ఉదయం వేళల్లో సహస్రనామార్చన నిర్వహించే ప్రక్రియను ఇప్పటి వరకు నిర్వహిస్తున్నారు. దేవస్థానం వైదిక వర్గాల సూచనతో ఇక మీదట ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుంచి సహస్ర నామార్చనని స్వామివారి మూలవిరాట్‌కి చేసే విధంగా దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం 5 గంటల నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పూజలో పాల్గొనే భక్తులను భోగమండపంలో ఆశీనులను చేస్తారు. 1001 నామాలను పఠిస్తూ అర్చకులు స్వామివారి మూలవిరాట్‌కి సహస్రనామార్చన చేశారు. ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కాగా ఉదయం వేళల్లో కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులకు నిర్వహిస్తున్న సహస్రనామార్చన యథావిధిగా కొనసాగుతుందని ఈవో తెలిపారు.



సహస్ర నామార్చనలో పాల్గొన్న భక్తులతో ఈవో శ్రీనివాసమూర్తి దంపతులు

కేజీబీవీ పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్ వితరణ

సబ్బవరం : స్థానిక కేజీబీవీ విద్యాలయానికి సబ్బవరంలోని సూర్య మెడికల్స్ యజమాని బాదిరెడ్డి లక్ష్మణ మంచి నీటి ఫిల్టర్ బహూకరించారు. స్థానిక సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు చేతుల మీదగా కేజీబీవీ ఎస్‌వో మృదులకు శుక్రవారం దీనిని అందజేశారు. దీని విలువ రూ. 20 వేల వరకు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాత బాదిరెడ్డి లక్ష్మణతో పాటు బాలికా విద్యాలయం ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కేజీబీవీ ఎస్‌వోకు వాటర్ ప్యూరిఫయర్ అందజేస్తున్న సర్పంచ్ ప్రసాదరావు, లక్ష్మణ

జూనియర్ వైద్యులకు మద్దతు

- నేడు ప్రభుత్వ వైద్యుల నిరసన

మహారాణిపేట : దేశం యావత్తు తలదించుకునేలా ఒక పీజీ డాక్టర్‌పై జరిగిన అరాచకత్వాన్ని తీవ్రంగా ఖండిస్తూ దేశవ్యాప్త జూనియర్ డాక్టర్ల ఆందోళనకు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ సంఘీభావం తెలియజేస్తుందని అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పిడకల శ్యాంసుందర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. అలాగే జూనియర్ డాక్టర్ల ఉద్యమానికి సంఘీభావం తెలియజేస్తూ నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరు కావాలన్నారు. దేశవ్యాప్తంగా వైద్య విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు, పీజీ విద్యార్థులు, డాక్టర్లు అత్యవసర పరిస్థితిని కూడా బహిష్కరించి ఉద్యమం చేస్తున్న వేళ ప్రభుత్వ డాక్టర్లు ఎటువంటి ఆందోళనలు చేయకుండా పేద రోగుల చికిత్సకు పూర్తిగా సహకరించాలని అసోసియేషన్ రాష్ట్ర కమిటీ అత్యవసర సమావేశంలో నిర్ణయం తీసుకుందన్నారు. తమ అసోసియేషన్‌తో సంబంధం లేని కొంత మంది వ్యక్తులు ఉనికి కోసం ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ పేరుతో బాధ్యతారాహిత్యంగా గంట పాటు విధులు బహిష్కరించి ధర్నా చేయాలని పిలుపునివ్వడం చట్టరీత్యా నేరమని, అలా పిలుపునిచ్చిన వారిపై తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

సమన్వయంతో సమగ్రాభివృద్ధి

పెందుర్తి : పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిదులంతా సమన్వయంతో నడుచుకుంటూ గ్రామాలను అభివృద్ధిపథంలో నిలుపుదామని ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. ఎంపీపీ మధుపాడ నాగమణి ఆధ్వర్యంలో పెందుర్తి మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఎమ్మెల్యే రమేష్‌బాబును కలిసారు. నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం భేటీ అయి పెందుర్తి గ్రామీణ మండలం అభివృద్ధి పనులకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి తాను పూర్తిస్థాయి సహకారం అందిస్తానని చెప్పారు. జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, వైస్ ఎంపీపీ చిరికి దేముడు, ఎంపీటీసీలు నందవరపు అప్పలరాజు, స్వప్న, సర్పంచ్‌లు ఉగ్గిన గోవింద్, గొరపల్లి శ్రీను, కొయిలాడ శ్రీను, నాయకులు మధుపాడ అంజి, ఉప్పిలి కనకరాజు, గనిశెట్టి కనకరాజు, బొడ్డు సూర్యప్రకాష్, సారిపల్లి గణేష్, గిరి తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును సత్కరిస్తున్న ఎంపీపీ నాగమణి తదితరులు

ఆకట్టుకున్న కళారూపాల ప్రదర్శన

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన కళారూపాల ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. స్టీల్ సీఐటీయూ కార్యాలయం ఆవరణలో ఉక్కు అభ్యుదయ కళావేదిక ఆధ్వర్యంలో ఉక్కునగరం విద్యార్థులు, గాజువాకకు చెందిన నాట్య అకాడమీ విద్యార్థులు వివిధ కళారూపాలను ప్రదర్శించారు. జీవీఎంసీ 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ గంగారావు మాట్లాడుతూ ప్రజా పోరాటాల ద్వారా ఏర్పడిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అదే ప్రజా పోరాటాల ద్వారా కాపాడుకోవడం సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో స్టీల్ సీఐటీయూ నాయకులు జె. అయోధ్యరామ్, య. రామస్వామి, పి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.